సాక్షి కర్నూలు

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన సి. సుష్మ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.



కొనసాగుతున్న మహాయజ్ఞం

శ్రీశైల క్షేత్రంలో నవకోటి జప అష్ట వింశతి మహాయజ్ఞ క్రతువు కొనసాగుతోంది. ఈ నెల 26న పూర్ణాహుతితో ఈ యజ్ఞం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

చేనేత వస్త్రాలకు హ్యాండ్‌లూమ్ బ్రాండింగ్

● మార్కెట్‌లో ఆదరణ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఉత్పత్తవుతున్న చేనేత వస్త్రాలను ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా చేనేత వస్త్రాల తయారీలో విశేషంగా రాణిస్తున్న చేనేత సహకార సంఘాలను గుర్తించి ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్‌లో రిజిస్ట్రేషన్ కోసం వివరాలు నమోదు చేసే కార్యక్రమాన్ని చేనేత, జౌళి శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లాలో మూడు, నంద్యాల జిల్లాలో 4 చేనేత సహకార సంఘాలను రిజిస్ట్రేషన్ చేసే కసరత్తు చేపట్టారు. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోనిలో వెంకటాచలపతి, కోడుమూరులో నీలకంఠేశ్వర చేనేత సహకార సంఘాలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని నీలకంఠేశ్వర, బనగానపల్లిలోని నందివర్గం, కోవెలకుంట్ల, నంద్యాల చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలకు ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ ఇవ్వడానికి రిజిస్ట్రేషన్ కోసం ప్రాథమిక కార్యక్రమాలను పూర్తి చేశారు. దీనిపై ప్రత్యేక టీమ్ వచ్చి ఆయా సంఘాల్లో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలిస్తుంది. అనంతరం ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారని చేనేత, జౌళి శాఖ అధికారులు తెలిపారు. ఈ బ్రాండింగ్ వస్తే చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో ఆదరణ లభించనుంది.

జేఎన్-1 వేరియంట్ తీవ్రత తక్కువే

● డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్-19 జేఎన్-వన్ వేరియంట్ తీవ్రత పెద్దగా ఉండబోదని నిపుణులు చెబుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. కొత్త వేరియంట్ వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కోవిడ్ ప్రోటోకాల్ పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కేరళ, హైదరాబాద్ ఎవ్వరైనా వెళ్లి వచ్చి ఉంటే వారిని పరిశీలించి లక్షణాలున్న వారు ఐసోలేషన్(ఇంట్లోనే) ఉండే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శ్యాంపిల్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం ముందు జాగ్రత్తగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 2 వేలు, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 3వేల ఆర్‌టీపీసీఆర్ కిట్లు పంపిణీ చేశామన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు ఉన్న వారిని పరిశీలించి వారికి ర్యాపిడ్ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. పాజిటివ్ వస్తే ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదన్నారు. అవసరమైన మందులు, మాస్కులు, ఆక్సిజన్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు.



పత్తికొండ మండలం చందోలి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

'గడపగడప'కూ అభివృద్ధి

- ఒక్కో సచివాలయ పరిధిలో రూ.40 లక్షల విలువ చేసే పనులు
- గ్రామాల్లో అంతర్గత రహదారులకు ప్రాధాన్యత
- మంజూరైన 691 పనుల్లో ఇప్పటికే 222 పూర్తి
- రూ.30.32 కోట్ల అంచనాతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

కర్నూలు(అర్బన్): 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యతను ఇస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి రూ.2 కోట్లు, ప్రతి సచివాలయ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు మొదట రూ.20 లక్షలను విడుదల చేసిన ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.40 లక్షలకు పెంచింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో స్థానిక శాసనసభ్యులు కచ్చితంగా పర్యటించి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణను రూపొందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 465 గ్రామ సచివాలయాల పరిధిలో రూ.30.32 కోట్ల అంచనాతో 691 పనులను మంజూరు చేసింది. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల విలువ చేసే పనులను చేపడుతున్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో చేస్తున్న పనులతో గతంలో పూర్తి అధ్వానంగా ఉన్న వీధులు నేడు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. గతుకుల రోడ్లలో ఇబ్బందులు పడిన ప్రజలు నేడు సీసీ రోడ్లు వేయడం వల్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన 222 పనులు

జిల్లాలో మొత్తం రూ.30.32 కోట్ల అంచనాతో 691 పనులు చేపట్టగా ఇప్పటి వరకు 222 పనులను పూర్తి చేశారు. మిగిలిన వాటిలో 343 పనులు పురోగతిలో ఉండగా, వివిధ కారణాలతో 126 పనులు ప్రారంభం కాలేదు. వీటిని కూడా వెంటనే ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.7.95 కోట్లను విడుదల చేసింది.

స్థానిక అవసరాలకు పెద్ద పీట

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల స్థానిక అవసరాలు తీర్చేందుకే నిధులను వెచ్చించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, రోడ్లు, సీసీ డ్రైన్స్ నిర్మాణం తదితర పనులకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనే ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజలు తమ ప్రాంత అవసరాలను తీర్చాలని కోరిన వెంటనే సంబంధిత మండల ఇంజినీరు ద్వారా లైన్ ఎస్టిమేట్ వేయిస్తారు. చేపట్టాల్సిన పనికి సంబంధించిన ప్రస్తుత ఫొటోను జతచేసి సంబంధిత నోడల్ అధికారి (ఎంపీడీఓ) ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇలా ఆన్‌లైన్‌లో పంపిన వివరాలను ప్రభుత్వం పరిశీలించి ఆయా పనులకు ఆమోదం తెలిపిన వెంటనే ఆయా పనులు చేపట్టేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ పాలనా అనుమతులు మంజూరు చేస్తున్నారు.

సీసీ రోడ్డుకు నీరు పడుతున్న ఈ దృశ్యం పత్తికొండ పట్టణం రాజీవ్‌నగర్ కాలనీలోనిది. గతంలో ఈ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షలు వెచ్చించి ఈ వీధిలో 1.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు వేశారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.





కంకరతో మొదటి లేయర్ పూర్తి చేసుకుని సీసీ రోడ్డుగా రూపుదాలుస్తున్న ఈ దారి తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలోనిది. గతంలో అధ్వానంగా ఉండేది. గుంతలమయమై వర్షకాలంలో వాహనాలు వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉండేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 650 మీటర్ల మేర సీసీ రోడ్డు వేస్తున్నారు.

నిధుల కొరత లేదు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు. పనులు చేసిన అనంతరం బిల్లులను అప్లోడ్ చేసిన వెంటనే విడుదలవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే అప్లోడ్ అయిన బిల్లులకు రూ.7,95,33,000 విడుదలయ్యాయి. ఈ కార్యక్రమం కింద చేపడుతున్న పనుల వేగం పెంచాలని ఇప్పటికే క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం.

–కే సుబ్రమణ్యం, పీఆర్ పర్యవేక్షక ఇంజినీరు

ఇబ్బందులు తొలగిపోయాయి



ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.40 లక్షలు కేటాయించడం హర్షణీయం. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. సీసీ రోడ్లు వేయడం వల్ల ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.

–కొండపల్లి శ్రీరాములు, పత్తికొండ

వ్యవసాయాన్ని పండుగ చేసిన సీఎం జగన్

● వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగల భరత్‌కుమార్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న వంగల భరత్‌కుమార్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేయడంతో పాటు రైతుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగల భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల మధ్య జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకరరెడ్డితో కలసి కేక్ కట్ చేసి రైతులకు తినిపించారు. ఈ సందర్భంగా వంగల భరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకంతో అన్నదాతలకు పెట్టుబడి సమస్యలు తగ్గాయన్నారు. రూపాయి ప్రీమియం లేకుండా ఉచిత పంటల బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖల సేవలన్నీ రైతుల ముంగిటకే తెచ్చారని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవసాయాన్ని దండగ చేయగా... వైఎసార్‌సీపీ ప్రభుత్వం పండుగ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రైతు నాయకులు బిజ్జం మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులోని సంకల్‌బాగ్‌లో బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి



ఉత్తర ద్వార దర్శనం.. సర్వపాప హరణం

జిల్లాలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు వైష్ణవ ఆలయాలకు పోటెత్తారు. ఉత్తర ద్వారం గుండా వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని తరించారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా శ్రీహరిని దర్శించుకుంటే పుణ్యం కలగడంతో పాటు సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పాఠశాల రూపురేఖలు మారాయి



గతంలో మా పాఠశాల అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే తరగతి గదులు ఉరుస్తూ ఉండేవి. తరగతి గదుల కొరత కూడా ఉండేది. నాడు–నేడు పథకంతో ప్రస్తుతం పాఠశాల రూపురేఖలు మారాయి. రెండు విడతల్లో రూ.1.25 కోట్ల నిధులు రావడంతో వాటితో ఆరు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తి కావచ్చింది. తరగతి గదుల మరమ్మత్తులు చేపట్టారు. కొత్తగా బెంచీలు, ఫ్యాన్లు వచ్చాయి. పైపులైన్, సంపు, మరుగుదొడ్ల నిర్మాణంతో సమస్యలన్నీ తీరిపోయాయి. గతేడాది 740 మంది విద్యార్థులు ఉండగా ఈఏడాది 893 మందికి పెరిగారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌లు, బైజూస్ కంటెంట్‌తో కూడిన బోధనతో విద్యా ప్రమాణాలు పెరిగాయి. వచ్చే ఏడాది మా పాఠశాల విద్యార్థులు తొలిసారి సీబీఎస్ఈ పరీక్షలు రాయనున్నారు. మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దింది.

– ఉపేంద్ర, ప్రధానోపాధ్యాయుడు, జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పథకాలు ఆదుకున్నాయి

మాకు ఆస్తిపాస్తులు లేవు. వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పొదుపు గ్రూపులో చేరి 2019లో రూ. 2,77,500 లోన్ తీసుకున్నా. బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 2,20,000, సీఐఎఫ్ కింద రూ. 2,00,000 రుణాలు తీసుకొని నాలుగు బర్రెలు కొనుగోలు చేసి పాల వ్యాపారం ప్రారంభించా. ఈ వ్యాపారంతో రోజుకు రూ. 800 చొప్పున సంపాదిస్తున్నా. దీనికి తోడు కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. ప్రభుత్వ పథకాలు మమ్మల్ని ఆదుకున్నాయి. ఇటీవలే ఎకరం పొలం కూడా కొనుకున్నా. 2019 నుంచి పొదుపు గ్రూప్‌లకు ఉన్న రుణాల మొత్తం రూ. 8లక్షలకు పెంచడం మాకు కలసివచ్చింది.

– గడివేముల నందమ్మ, పాణ్యం



'ఆడుదాం- ఆంధ్రా'కు అన్ని ఏర్పాట్లు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య

కర్నూలు (టౌన్): ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. 'ఆడుదాం–ఆంధ్రా'లో భాగంగా శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ పోటీలపై ఈనెల 26న జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈనెల 24 వరకు యోగా, మారథాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన యోగా క్రీడాకారులు ప్రసన్న, మునిస్వామి, మనీషా, మనుశ్రీ, మనస్వి, గురుప్రీతిలను ఇన్‌చార్జ్ కలెక్టర్ అభినందించారు. డీఈఓ రంగారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి యోగా చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య తదితరులు

రెండు రైళ్లు రద్దు

కర్నూలు (రాజ్‌విహార్): కర్నూలు నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరే కాచిగూడ డెమో ఎక్స్‌ప్రెస్ (17436), ఉదయం 5:30 గంటలకు బయలుదేరే హంద్రీ ఎక్స్‌ప్రెస్ (17028)ను ఆదివారం రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఐదుగురు విద్యార్థుల డిబార్

కర్నూలు కల్చరల్: డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడుతుండగా ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు శనివారం విలేకరులకు తెలిపారు. చాగలమర్రి సెయింట్స్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు, కోవెలకుంట్ల ఎస్వీబీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల పీఎస్సీ అండ్ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున డిబార్ అయ్యారని పేర్కొన్నారు. శనివారం డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షను 67 కేంద్రాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 9,711 మందికి గాను 8,887 మంది హాజరు కాగా 824 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపంతో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పట్టణంలోని గోనెగండ్ల రోడ్డులో చోటు చేసుకుంది. భర్త చిన్నరంగస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో గోనెగండ్లకు చెందిన పెద్ద మునెమ్మ కొంత కాలంగా ఎమ్మిగనూరు పట్టణంలోని గోనగండ్ల రోడ్డులో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటోంది. కుమార్తె మంజుల(21)కు పత్తికొండకు చెందిన అబ్బాయితో పెళ్లి నిశ్చయించారు. అయితే పెళ్లి ఇష్టం లేదని మంజుల మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తల్లి.. కుమార్తెను చూసి కిందకు దించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మస్తాన్‌వలి చెప్పారు.

'తట్టు'కోలేక చిన్నారి మృతి!


భానుప్రియ (ఫైల్)

హొళగుంద: తట్టు (అమ్మోరు) పోసి హెబ్బటం గ్రామానికి చెందిన చిన్నారి భానుప్రియ(4) శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పర శ్రీకాంత్, లక్ష్మి దంపతుల కుమార్తె భానుప్రియకు నాలుగు రోజుల క్రితం తట్టు పోసింది. కుటుంబ సభ్యులు పల్లెటూరి సంప్రదాయాలను పాటించారు. అయితే శుక్రవారం తీవ్రంగా జ్వరం రావడంతో పాటు అస్వస్థతకు గురికావడంతో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన సూచన మేరకు ఆదోనికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చిన్నారి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ముద్దులొలికే చిన్నారి మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రుద్రవరం: తిమ్మనపల్లె మెట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పనపల్లెకు చెందిన బాల నాగమ్మ(50) అనే మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అప్పనపల్లెకు చెందిన కృష్ణయ్య, లక్ష్మి నరసమ్మ, బాలనాగమ్మ వైకుంఠ ఏకాదశి సందర్భంగా అహోబిల క్షేత్రానికి వెళ్తుండగా తిమ్మనపల్లె వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాలనాగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె మృతి చెందినట్లు మృతురాలు బంధువులు తెలిపారు.



నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ


కర్నూలు: వెంకటరమణ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు


మహానంది: ఉత్తర ద్వారంలో పూజలు చేస్తున్న అర్చకులు


కృష్ణగిరి: కర్లకుంటలో శ్రీవారికల్యాణం జరిపిస్తున్న పండితులు


జూపాడుబంగ్లా: అలంకరణలో తర్తూరు రంగనాథస్వామి ఆలయ ముఖద్వారం


బేతంచెర్ల : మద్దిలేటిస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


అవుకు: చెన్నకేశవస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద పోటెత్తిన భక్తులు

'వైకుంఠ' వైభోగం

గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి... వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.. శనివారం జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉత్తర ద్వారంలో భక్తులకు శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనమిచ్చారు. పలు చోట్ల స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం రమణీయంగా సాగింది. నంద్యాలలో దేవాలయాలను మకర తోరణాలతో అలంకరించి.. శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. డోన్ పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మిగనూరులో అశేష భక్తజనం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. వెల్దుర్తి మండలం రామళ్లకోటలో గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. మద్దికెర మండలం పెరవలిలో శ్రీరంగనాథస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అవుకు పట్టణంలో తితిదే బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. ఆస్పరి మండలం హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో సహజ సిద్ధ ఉత్తర ముఖ ద్వారంగా వెలసిన కూర్మనారాయణస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కర్నూలు నగరంలోని వైష్ణవాలయాలు భక్తులతో సందడిగా దర్శనమిచ్చాయి.

– సాక్షినెట్‌వర్క్


పాణ్యం: ముగ్గులో వీరనారాయణ స్వామి


భక్తి పారవశ్యం: స్వామివారికి నమస్కరిస్తున్న భక్తులు


కర్నూలు: తిరునామాలు అద్దుతున్న మహిళ


మంత్రాలయం: వైకుంఠ ద్వార ప్రవేశంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు


కర్నూలు: వెంకటరమణ కాలనీలో క్యూలో నిల్చున్న భక్తులు


శ్రీశైలం: స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఎమ్మిగనూరు: వెంకటసాయి దేవాలయం వద్ద..


కర్నూలు: కృష్ణానగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూ

కొనసాగుతున్న నవకోటి మహాయజ్ఞం


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవీ విహార్ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ సద్గురు జగన్నాథ స్వామి పొన్నూరు ఆశ్రమ సేవా ఆధ్వర్యంలో నవకోటి జప అష్ట వింశతి మహా యజ్ఞ క్రతువు కొనసాగుతోంది. ఈనెల 22న ప్రారంభమైన ఈ యజ్ఞం 26వ తేదీన పూర్ణాహుతితో ముగుస్తుందని యల్లాప్రగడ పవన్‌కుమారశర్మ శనివారం తెలిపారు. లోక కల్యాణార్థం దేశ వ్యాప్తంగా ఈ యజ్ఞాన్ని జగన్నాథస్వామి ఆశ్రమ సేవా సమితి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూజల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచణం, జ్యోతిప్రజ్వలన, సామూహిక హోమాలు, జగన్నాథస్వామివారి దివ్యలీలలపై ప్రవచనాలు, భజనలుతో పాటు పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజు 26వ తేదీన జప, హోమాది క్రతువులతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిర్దేశిత చార్జీలు మాత్రమే వసూలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం పరిధిలోని ఆటో, ట్యాక్సీల్లో నిర్దేశిత చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సూచించారు. శనివారం క్షేత్ర పరిధిలోని ఆటో, ట్యాక్సీ నిర్వాహకులతో డి.పెద్దిరాజు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ జి.లక్ష్మణరావులతో కలిసి దేవస్థానం కార్యాలయ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈట మాట్లాడుతూ ఆటో ట్యాక్సీల డ్రైవర్లు భక్తులతో మర్యాదగా మెలగాలని, ముఖ్యంగా ప్రమాదాలు నిరోధించేందుకు వేగపరిమితిని పాటించాలన్నారు. సీఐ మాట్లాడుతూ స్థానికంగా ఒక్కొక్కరికి లోకల్ లింక్ సర్వీసుకు రూ.20, లోకల్ సైట్ సీయింగ్‌కు పోనురాను చార్జీలు రూ.100, లోకల్ సైట్‌సీయింగ్, శ్రీశైలం ప్రాజెక్ట్ సందర్శనకు పోనురాను చార్జీగా రూ.150, శ్రీశైలం నుంచి లింగాలగట్టుకు రూ.120, శ్రీశైలం నుంచి సున్నిపెంటకు రూ.100 మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఆటో రేట్ల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శింపజేయాలన్నారు. ఈ రేట్ల పట్టికల స్టిక్కర్లను దేవస్థానమే అందజేస్తుందని చెప్పారు.

ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ధర్నా


మృతదేహంతో ధర్నా చేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి ఎదుట శనివారం మృతదేహంతో బాధితులు ధర్నా నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆదోని పట్టణం అరుంజ్యోతినగర్ కాలనీకి చెందిన కదిరికోట దానమ్మ(48) మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపించారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... గర్భసంచి సమస్యతో ఈనెల 16న దానమ్మ చికిత్స చేయించుకునేందుకు ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. వైద్యుల నిర్లక్ష్యంతో ఆమె శనివారం మృతిచెందినట్లు బంధువులు ఆరోపించారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దానమ్మ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. దానమ్మ భర్త కొన్ని నెలల క్రితమే అనారోగ్యంతో మృతిచెందారు. ఈమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దానమ్మ మృతిచెందడంతో కుమారులు, కుమార్తెల పరిస్థితి ఏమిటని కుటుంబ సభ్యులు, జై భీమ్ నాయకులు ప్రైవేట్ హాస్పిటల్ యాజమానాన్ని నిలదీశారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడి దుర్మరణం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని పాలసాగరం రోడ్డులో ఆటో బోల్తాపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. కోట కందుకూరు గ్రామానికి చెందిన చాకలి దండు పెద్ద సుబ్బరాయుడు (80) అనే వృద్ధుడు పట్టణంలో బట్టలు ఇస్త్రి చేసి జీవనోపాధి పొందేవాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే శనివారం పట్టణంలో పని ముగించుకుని గ్రామానికి వెళ్లేందుకు ఆటోలో ఎక్కాడు. ఆటో పాలసాగరం సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా మోటర్‌సైకిల్ రావడంతో తప్పించబోయిన డ్రైవర్ ఆటోను వేగంగా పక్కకు తిప్పాడు. దీంతో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చాకలి దండు పెద్ద సుబ్బరాయుడు మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యోగా విజేతలకు జిల్లా జడ్జి అభినందన


విజేతలతో జిల్లా జడ్జి నాగశ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్‌లోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆడిటోరియంలో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన ప్రపంచ యోగా పోటీల్లో కర్నూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎస్.ప్రసన్న (మొదటి స్థానం), కె.మునిస్వామి (రెండో స్థానం), ఎస్.కేనీష్ (మూడో స్థానం), ఎం.మానుశ్రీ, పి.మనస్విని (నాల్గో స్థానం), జి.గురుప్రీతి (ఐదో స్థానం) విజేతలుగా నిలిచారు. వీరిని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి పిలిపించి అభినందించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు


మహిళామార్ట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

కోడుమూరు: స్థానిక మహిళామార్ట్‌లో ఇక నుంచి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన బియ్యం, కొర్రలు, సజ్జలు, వేరుశనగ, శనగలు, పసుపు వంటి వాటిని విక్రయిస్తున్నట్లు డీఆర్‌డీఏ వైకేపీ పీడీ సలీంబాషా తెలిపారు. శనివారం పీడీ సలీంబాషా, డీపీఎం చంద్రశేఖర్, ఏపీడీ శ్రీధర్‌లు ఏపీఎంలు పుష్పావతి, శ్రీనివాసులుతో కలిసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పండించే రైతుల పొలాలను, చేయూత మహిళా మార్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పర్యావరణం దెబ్బతినకుండా పండించే పర్యావరణ ఉత్పత్తులను చేయూత మహిళా మార్ట్‌లో విక్రయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య సభ్యులు, చేయూత మహిళా మార్ట్ సభ్యులు ఉన్నారు.

ఉప్పును అన్‌లోడ్ చేస్తుండగా కార్మికుడి మృత్యువాత


మృతి చెందిన సోన్యా నాయక్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ వ్యాగన్ నుంచి సముద్ర ఉప్పును అన్‌లోడింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండాకు చెందిన రమావత్ సోన్యా నాయక్(36) అనే కార్మికుడు మృతిచెందాడు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కర్నూలు సర్కిల్ హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు తెలిపిన వివరాల మేరకు.. సోన్యా నాయక్, ఆయన భార్య రమావత్ జెడీ నాయక్, గ్రామస్తులు మరికొందరు వెల్దుర్తి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ వ్యాగన్ నుంచి ఉప్పును కర్నూలు ఫ్యాక్టరీలకు తరలించే లారీలలో అన్‌లోడ్ చేసే పనికి శుక్రవారం వచ్చారు. శనివారం తెల్లవారుజామున పని చేస్తుండగా లారీ వెనుక భాగం సోన్యా నా యక్ కణతకు బలంగా తగలడంతో అక్కడే కుప్పకూలాడు. వెంటనే దగ్గరలోని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. రైల్వే హెచ్‌సీ కోదండరాముడు సంఘటనాస్థలికి చేరకుని విచారించారు. లారీని సీజ్ చేయడంతోపాటు, సూదేపల్లె డ్రైవర్ పెద్దయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.